90 నిమిషాలలో విమాన ప్రమాదం!

డాక్టర్ పెందుర్తి మాస్టర్జీ

బొంబాయి, సింధియా నగర్‌లో నైట్ పారడైజ్ క్లబ్ అది.

ఎనిమిది గంటల సమయంలో ఒక్కొక్కరు రూమంతా నిండిపోయారు. మొత్తం నూట డెబ్భైఏడు సీట్లు ప్రేక్షకులతో నిండిపోయాయి. కొందరు జిన్ త్రాగుతున్నారు, కొందరు చికెన్ ఫ్రై తింటున్నారు. అందరి కళ్లు డాన్స ఎప్పుడు ప్రారంభమవుతుందో స్టేజిపైకి చూస్తున్నాయి.

నరేంద్ర బ్రాంది ఒక్కొక్క పెగ్ తాగుతూ, చిప్స తింటున్నాడు.

ఎనిమిది గంటలయింది. వెస్టరన్ మ్యూజిక్ ఆగి పోయింది, రెడ్ లైట్స్ ఆరిపోయి, బ్లూ లైట్స్ వెలిగాయి.

"డియర్ ఫ్రండ్స్ యిప్పుడు ప్రఖ్యాత కేబ్రా డాన్సర్ లూసియా డాన్స్ చేస్తుంది. ఉయ్ ఎంజాయ్ విత్ హర్" అన్నాడు ఎనౌన్సర్.

స్టేజిపైన రెండు రంగుల లైట్లు వెలిగాయి. ఆ రంగుల వెలుగులో రంగు రంగుల లూసి వేదిక మీదకు వచ్చింది. స్పాట్ లైట్స్ వెలుగులో వెన్నెలలా వెలిగిపోతూంది. గోల్డ్ కలర్ క్రీమ్ పూయటంతో బంగారు రంగు శరీరంతో మరీ సుందరంగా వుంది. రొమ్ముల మీద గోల్డ్ కలర్ దారాలు కదులుతూ వున్నాయి. బొడ్డుకు బాగా దిగువగా చేతిరుమాల చుట్టినట్లున్న గుడ్డపైన వజ్రాలు పొదిగినట్లు వుంది. ఆమె కదలికలో తొడలు దూరం కావటంలో బొడ్డు దిగువభాగం కనిపిస్తుందేమో చూస్తున్నారు. కైపులో వున్న కళ్లు, తూపుల్లాటి చూపులు, వయ్యారం వలికించే అధరాలు ప్రేక్షకుల్ని కవ్విస్తున్నాయి.

నరేంద్ర సిగరెట్ వెలిగించి చూస్తున్నాడు.

ఇంతలో ఎదురుగా కూర్చున్న వ్యక్తి "మిస్టర్ నరేంద్ర" అని పిలిచాడు. నరేంద్ర ఉలిక్కిపడ్డాడు. అతను బ్రీఫ్ కేసు నరేంద్రకు దగ్గరగా జరిపాడు. "యీ కేసు తీసుకోండి." నరేంద్ర చూశాడు.

చిన్న కవరు ఒకటి అందించాడు. "దాన్లో ఇన్‌స్ట్రక్షన్స్ వున్నాయి" అన్నాడు మెల్లగా. నరేంద్ర తలూపాడు. అతను వెళ్ళిపోయాడు.

లూసియా స్టేజిపైకి నడుస్తూ చంకల బ్రా విప్పి విసిరింది. గబాలున వదులుగా వున్న వెంట్రుకలు రొమ్ముల

మీద వేసుకుంది. యింతింతైన రొమ్ములు ఎత్తుగా బలంగా వున్నాయి. రష్యన్ యువతిలా బలమయిన శరీరం లూసిది. వయసు పాతికపైగా వుంటాయి. ఒక పురుష బృందం ముందు నగ్నంగా తిరగటానికి ఆమెకు సిగ్గులేదు.

అదే సమయంలో—

"డియర్ క్లారా ఈసారి మీ చెల్లెలు లూసి పేర పాస్‌పోర్టు తీసుకుంటున్నాను" అన్నాడు రఘువీర్ సిగరెట్టు వెలిగిస్తూ. ప్రక్కగదిలో లూసి డాన్స్ మ్యూజిక్ వినిపిస్తుంది.

"అదేమిటి బాస్."

"అవును ఆ పాస్‌పోర్టులో న్యూయార్కు వెళ్ళాలి."

"నేను వెళ్ళను బాస్, భయంగా వుంది."

"ఇది ఆఖరుసారి. చివరసారిగా న్యూయార్క్ వెళ్ళు. బోయింగ్ 707 లో నీ ప్రయాణం. నీతోపాటు అదిగో అతను రావచ్చు."

"అతనెవరు బాస్?"

"మన గాంగ్‌కి క్రొత్త మెంబర్ నరేంద్ర."

"మీలా వున్నాడు బాస్" అంది, మిర్రర్‌లోనుండి నరేంద్రను చూసి ఆశ్చర్యపోతూ. "ఎగ్జాక్ట్లీ, నీవు, లూసి కవల పిల్లలు ఒకర్ని చూసి ఒకరని భ్రమపడతారు. మీ యిద్దర్నీ నిశితంగా చూస్తే తప్ప పోల్చలేరు. అందుకే నీవు అతనితో న్యూయార్క్ వెళ్ళాలి."

క్లారా క్షణం ఆలోచించి "అలాగే బాస్" అంది లేవబోతూ.

"జస్ట్ ఏ మినిట్ నీవు నరేంద్ర వున్న లాడ్జిలో కెళ్ళి, సీక్రెట్ పర్సన్ అవునా కాదా? పోలీసులేమయినా

అతన్ని అనుమానిస్తున్నారా గమనించాలి" అన్నాడు సిగరెట్ వెలిగిస్తూ.

"అలాగే బాస్, అవసరమయితే."

"ఎంజాయ్ చెయ్ యాస్ యు లైక్ యిట్" అన్నాడు రఘువీర్ లేస్తూ.

స్టేజిమీద లూసియా రొమ్ముల్ని కదిలిస్తూ ప్రేక్షకుల్ని ఉత్తేజితుల్ని చేస్తోంది. ప్రేక్షకులు వుర్రూతలూగుతున్నారు.

2

అది బ్లూరూమ్. గుండ్రని బల్లచుట్టూ ఆరుకుర్చీలు వేయబడి వున్నాయి. ఒక్కొక్కరు వచ్చి కుర్చీలో కూర్చున్నారు. అందరి ముందు ముసుగు వేసుకున్న ఆకారం, కుర్చీలో కూర్చున్నాడు.

"డియర్ ఫ్రండ్స్! మనం ఎంతో శ్రమతో బంగారం వజ్రాలు సాధించాం. కోట్ల కొలది డబ్బు సంపాదించి కోటీశ్వరులం కాబోతున్నాం. అయితే ఈ ప్రయత్నంలో పోలీసులు మనల్ని అనుమానించలేరు. అందుకే మనం న్యూయార్క్ వెళ్ళాలి. కొన్ని రోజులు అక్కడ గడిపి రావాలి."

అందరు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"మీ అనుమానం నాకు తెలుసు. నేను యిక్కడే వుంటానని! కాని నేను మీతోపాటు వచ్చి, మీతో తిరిగి వస్తాను."

"బాస్ మిమ్మల్ని మేము చూడలేదు" లజపతి అడిగాడు.

"యస్" అంటూ ముసుగు తీశాడు.

అతని పేరు రఘువీర్. నరేంద్ర పోలికలున్నాయి. ఒక సారి చూస్తే నరేంద్రని భ్రమపడవచ్చు. "యిప్పుడు మన బంగారం మన ఆరుగురికీ తెలిసిన చోట దాచాలి. ఆరుగురం కలిసే వెళదాం. అయితే ఒకరు, యింకొకరికి తెలిసినట్లు ప్రవర్తించకూడదు. ఈ రాత్రే బోయింగ్ 707లో బయలుదేరుదాం. ఏమయినా అభ్యంతరాలున్నాయా?"

"కాని బాస్, యింత హఠాత్తుగానా!" మేఘశ్యామ్ అన్నాడు.

"పరిస్థితులు అలాంటివి. పోలీసుల దర్యాప్తులో మనం అనుమానితులం కాకూడదు."

"యస్ బాస్! నీవల్లే లక్షాధికారులమయ్యాం, నీవల్లే కోటీశ్వరులమవుతాం. మీ యిష్టాన్ని కాదనేది లేదు" అన్నాడు అనంతం.

"గుడ్! మీతోపాటు నరేంద్ర అనే పేరుతో నేను బోయింగ్ 707లో వస్తాను. మీపైకంటే క్రైమ్‌బ్రాంచి వాళ్ళకు నాపై అనుమానం ఎక్కువ కాబట్టి మీలో ఏ ఒక్కరు నన్ను ప్రశ్నించకూడదు. మాట్లాడకూడదు. మీరేదయినా అడిగినా తెలియనట్లు ప్రవర్తిస్తాను. అది న్యూయార్కులో దిగేవరకు" అన్నాడు రఘువీర్.

"ఓ. కే. బాస్" అన్నారందరూ.

3

బ్రీఫ్ కేస్ తీసుకుని నరేంద్ర లేచి బయటకు నడిచాడు. తన నెవరయినా గమనిస్తున్నారేమో చుట్టూ కలయ చూశాడు. లోపల లూసి డాన్స్ జోరుగా సాగుతూనే వుంది.

నరేంద్ర "టాక్సి" పిలిచాడు. టాక్సి వచ్చి ఆగింది.

అజంతా లాడ్జికి వెళ్ళాడు.

గబగబ తన గదిలోకి వెళ్ళాడు. రూమ్ తాళం తెరిచాడు.

ఎదురుగా వున్న ఆకారాన్ని చూసి వులిక్కిపడ్డాడు. ఇప్పటివరకు డాన్స్ చేసిన లూసీ నగ్నంగా మంచంమీద పడుకొని బ్రాంది సిప్ చేస్తూ సిగరెట్ వెలిగిస్తోంది.

"ఏమిటి అలా చూస్తున్నావు?"

"ఇంత త్వరగా ఎలా వచ్చావ్?"

"ఈ కార్యక్రమంలో ప్రశ్న లుండవు నరేంద్ర, సమాధానాలు మాత్రమే. బాస్ ఆర్డర్ ఏమిటి?" అడిగింది ఆమె.

నరేంద్ర యింకా తేరుకోలేదు. ఆమె అందాన్నే అణువణువు నిశితంగా చూస్తున్నాడు. ఆమె నవ్వింది. "అందం ఎప్పుడు వుంటుంది, అనుభవం ఎప్పుడయినా లభిస్తుంది. డ్యూటీ ఫస్ట్" అంది కోపంగా.

నరేంద్ర కోటు విప్పి, టై వదులుచేసి "మీ పేరు?"

"క్లారాడయానా" అంది మరో పెగ్ తాగి.

నరేంద్ర కవరు తెరిచాడు. అందులో పాస్‌పోర్టు, తన ఫోటోతోసహా వుంది. ఆశ్చర్యపోయాడు, బాస్ ఎవరో చాలా ఆగంతకుడు అనుకున్నాడు.

"చాలా కేర్‌ఫుల్‌గా వుండాలి నరేంద్ర. బాస్ ఎముకలు పూడ్చి శవాలు తీసే అఖండుడు. ఏమాత్రమైనా అసమర్థత చూపావా, నీ శవం భగవంతుడికి కూడా కనిపించకపోవచ్చు. యీ బాధ్యతలో ఒక మనిషి పూర్వాపరాలు అవసరం. కేవలం డ్యూటీ, దానికి తగిన ఫలితం వేలలో, లక్షలలో వుంటుంది" క్లారాడయానా హెచ్చరించింది.

నరేంద్ర సిగరెట్ వెలిగించాడు, కవరులో వున్న ఒక లెటరు చదవసాగాడు. క్లారాడయానా చూస్తూంది.

"డియర్ నరేంద్ర,

నీవు మా పార్టీలో చేరడం మాకెంతో ఆనందం. నీవు చదువుకున్నవాడివి కాబట్టి నీవు చేయగలిగింది ఈ ఒక్క సహాయమే. యీ సహాయం చేస్తే మళ్ళీ మాతో చేయి కలపవలసిన అవసరం లేదు. ఆ తరువాత ఎక్కడయినా ఎలాగయినా బ్రతకవచ్చు. నీకు పంపబడ్డ బ్రీఫ్ కేసుతో పాటు ఎయిర్ పోర్ట్‌లో ఒక చిన్న బాక్స్ ఇవ్వబడుతుంది. దాంతో ప్రయాణం చెయ్. నీవు విమానం దిగాక అక్కడ మన మిత్ర బృందం కలుస్తారు. కంటికి రెప్పలా కాపాడ తారు. విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్ — బాస్."

లెటర్ ముగించి, క్లారా ముఖంలోకి చూశాడు. "బాస్‌ను నీవు చూశావా?"

"చూశాను."

"లెటరుద్వారా నాకేం తెలియలేదు."

క్లారా నవ్వింది. ఫోన్ మ్రోగింది. ఫోనెత్తాడు "హలో నరేంద్ర! నేను బాస్‌ను మాట్లాడుతున్నాను. నీకు పంపిన లెటరు నీళ్ళలో వేసి చదువు మరికొన్ని అక్షరాలు కనిపిస్తాయి. దానినిబట్టి ప్రవర్తించు. ఈ విషయం నీ ప్రక్కనే వున్న క్లారాకు తెలియకూడదు."

"యస్ బాస్" ఫోన్ పెట్టేశాడు.

కొన్ని నిమిషాల తర్వాత క్లారా వెళ్ళిపోయింది.

నరేంద్ర బాస్ పంపిన లెటరు తడిపి చదివాడు.

"రేపు రాత్రి బోయింగ్ 707లో న్యూయార్క్ బయలుదేరు. రేపు ఉదయం పోస్టులో కాష్ వస్తుంది.

నీవు బోయింగ్ 707 లో వెళుతున్నావని బయలుదేరే వరకు ఎవరికి తెలియకూడదు."

* * *

బొంబాయి శాంతాక్రజ్ విమానాశ్రయంలో రాత్రి ఎనిమిది ముప్పై ఐదు నిమిషాల సమయం. మెర్క్యూరీ లైట్లతో, ట్యూబ్ లైట్స్‌తో అలంకరించిన అందాల భవంతిలా వుంది ఎయిర్‌పోర్టు.

అప్పుడే పారిస్ నుండి వచ్చిన బోయింగ్ 707 రన్ వే పైనుండి, రన్ వే నంబర్ సిక్స్‌లోనికి మళ్ళింది. ప్రయాణీకులు ఒక్కొక్కరే దిగుతున్నారు. ఎనౌన్సుమెంట్ విమానం రాకను సూచిస్తూంది.

అందులోనుండి దిగాడు రాకేష్‌పాండే.

కస్టమ్స్ అధికారులు అందరితోపాటు రాకేష్‌పాండేని చెక్ చేశారు. "దిస్ యీజ్ స్మగుల్డ్ క్లాత్" అన్నాడు కస్టమ్స్ అధికారి. పాండేను వెంటనే మరో రూంలోనికి తీసుకువెళ్లారు. బట్టల్ని విప్పి తనిఖీ చేస్తున్నారు. శాప్, స్టిక్, బూట్స్ అన్నీ చూశారు.

బెల్ట్ బరువుగా వుంది. పైగా స్టిచ్ చేయబడి వుంది కుట్లు బ్లేడుతో కోసి చూశారు. లోపల పొడవయిన బంగారపు రేకు, పెన్ దాగున్నాయి. కాని అందులో విలువయిన వజ్రాలున్నాయి.

"యూ ఆర్ అండర్ అరెస్టు మిస్టర్ పాండే" అన్నాడు కస్టమ్స్ ఆఫీసర్ క్రయింబ్రాంచి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జాన్‌సన్‌కు ఫోన్ చేస్తూ.

4

రాత్రి ఎనిమిది గంటలయింది.

నరేంద్ర టాక్సి దిగి ఎయిర్‌పోర్టులో ప్రవేశించాడు.

రిజర్వేషన్ కౌంటర్ లోనికి వెళ్ళి పాస్‌పోర్టు మీద స్టాంపు వేయించుకొని బాచ్ నెంబర్ రాయించుకున్నాడు. మరో కౌంటర్ లోనికి వెళ్ళి బోయింగ్ వివరాలు తెలుసుకున్నాడు. జేబులో నుండి పాకెట్ తీసి సిగరెట్ వెలిగించాడు.

రానున్న వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నాడు.

జీనియస్ పైలట్ ఆఫీసర్ విజయ్ బ్లూ యూనిఫాం ధరించి హుషారుగా వస్తున్నాడు. ఉత్సాహం గల ముప్పై ఏళ్ళ యువకుడు, సభ్యత, సంస్కారం గల మనిషి. విజయ్ అంటే మిగిలిన పైలెట్ ఆఫీసర్లకు, ఎయిర్ హోస్టెస్ లకు జలసీ. ప్రక్కగా వచ్చిన ఎయిర్ హోస్టెస్ రాణి 'హలో సర్' అంది పలకరింపుగా.

"హలో...హలో...రాణి" అంటూ భుజంపై చేయి వేసి కాంటీన్ వైపు దారి తీశాడు. "లీడింగ్ ఎయిర్ హోస్టెస్‌లు ఎవరు?"

"నేను మెర్సి, జనీస్."

"ఓ. గుడ్ గర్ల్స్..." అని "టు పాంపెన్" అన్నాడు.

"మీ సైడ్ పైలెట్ ఎవరు?"

"కుమార్, మైడియర్ ఫ్రెండ్."

"జర్నీ చాలా జలసీగా వుంటుందన్నమాట" అంది నవ్వి.

అదే సమయంలో—

పోర్టికోలో ఒక కారులో రఘువీర్ కూర్చున్నాడు. అతని ప్రక్కనే పాణి కూర్చున్నాడు. రఘువీర్ బాక్స్ తెరిచాడు "యిది స్విచ్. నీవు నరేంద్రకు యిచ్చేటప్పుడు, నరేంద్ర చూడకుండా యీ స్విచ్ నొక్కి యివ్వు.

లెక్క ప్రకారం విమానం బయలుదేరిన తొంభై నిమిషా లకు యీ బాంబు పేలుతుంది. విమానం బయలుదేరిన రెండు గంటల తరువాత యీ పెట్టె తెరిచి వివరాలు తెలుసు కోమను. ఈ లోపు యిది తెరవకూడదు అని చెప్పాలి. ఇక నీవు వెళ్ళు'' అన్నాడు రఘువీర్.

పాణి కారు దిగాడు. రఘువీర్ కారు కదిలి వెళ్ళి పోయింది.

పాణి మెల్లగా లోపలకు వచ్చాడు.

అతని చేతిలో చిన్న పెట్టె వుంది. అందులో టైం బాంబు వుంది.

మెల్లగా నరేంద్ర దగ్గరకు నడిచాడు. ''విష్ యు బెస్ట్ ఆఫ్ లక్ డియర్ నరేంద్ర'' వత్తి పలికాడు.

''థేంక్స్'' అన్నాడు నరేంద్ర.

''డియర్ నరేంద్ర, యీ ప్రయాణంలో బాస్ నీకు పది వేలు యిచ్చారు'' అని కాష్ అందించాడు.

''ఇది చాలా తేలికయింది. జాగ్రత్తతో కూడింది' నీవు విమానం ఎక్కాక రెండు గంటల తరువాత యీ పెట్టె తెరచి చూడవచ్చు. పద్ధతులన్నీ యిందులో వున్నాయి. ఏ క్రైంబ్రాంచి వ్యక్తి నిన్ను అరెస్టు చేయడు. చేయ లేడు. అలాంటి భయాలు నీకేం లేవు. అక్కడ నువ్వు విమానం దిగాక, మన సిబ్బంది చాలా వుంది. అందరు నీతో సహకరిస్తారు. విమానంలో నీతో ఎవరు ఏ విధంగా మాట్లా డినా సమాధానం చెప్పవద్దు. నీతోపాటు మన గాంగ్ లో ఓ అమ్మాయి ప్రయాణం చేస్తుంది. ఆమె రహస్యంగా ఎవరితో మాట్లాడినా, ఆమెను రహస్యంగా ఎవరు ఏదడి గినా నీకు తెలుస్తుంది. నీ విషయం కూడా అంతే'' అన్నాడు పాణి.

నరేంద్ర మౌనంగా వింటున్నాడు.

"హియర్ ఈజ్ ఎన్ ఎనౌన్స్‌మెంట్ బోయింగ్ 707 పాసింజర్స్ ప్లీజ్ చెకప్ యువర్ పాస్‌పోర్ట్ బిఫోర్ జర్నీ" మైకు నుండి మాటలు వినిపించాయి.

ఎయిర్‌పోర్టు కోలాహలంగా వుంది. వెళ్ళే ప్రయాణీకులకు వీడ్కోలు యివ్వటానికి ఎందరో మిత్ర బృందం బంధువులతో సందడిగా వుంది. రఘువీర్ ముఠాలోని అనంతం, లజపతి, మహావీర్, మేఘశ్యామ్, కీర్తికాంత్ ఒక్కొక్కరు ఎయిర్‌పోర్టులో నిలబడి మార్చి మార్చి నరేంద్రను చూస్తూ, అతనే బాస్ అని భ్రమపడుతున్నారు.

"షాంపేన్ తీసుకుందాం" అంటూ పాణి కాంటీన్ వైపు దారి తీశాడు. నరేంద్ర అనుసరించాడు.

పావుగంట గడిచింది—

"హియర్ ఈజ్ ఏన్ ఇంపార్టెంట్ ఎనౌన్స్‌మెంట్ ది పాసింజర్స్ టు న్యూయార్క్ కేచ్ ది ఫ్లైట్ బోయింగ్ 707. రన్‌వె నెంబర్ త్రీ" మైకులో ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

పాణి స్విచ్ నొక్కి నరేంద్రకు టైంబాంబు అందించాడు.

ఒక్కొక్కరే బోయింగ్ 707 లోనికి ప్రవేశిస్తున్నారు—ప్రొఫెసర్స్, స్టూడెంట్సు, యాక్టర్స్ రకరకాల మనుషులు ఎక్కుతున్నారు. ఎయిర్ హోస్టెస్ రాణి ఒకొక్కరి పాస్‌పోర్టు చూసిలోపలికి పంపుతుంది. నరేంద్ర అందరితోపాటు లోపలకు ఎక్కి సీటులో కూర్చున్నాడు.

తన ఎడమప్రక్క ఓ యువతి. ఉలిక్కిపడ్డాడు.

'క్లారా' అన్నాడు మెల్లిగా. "నో లూసి" అంది నవ్వి. నరేంద్ర శాస్త్ర ఆలోచించాడు. క్లారా, లూసి యిద్దరు కవల పిల్లలని తీర్మానించుకున్నాడు. కుడివైపు ముసలి వ్యక్తి ప్రొఫెసర్‌లా వున్నాడు. ఏదో అడిగాడు. నరేంద్ర సమాధానం చెప్పాడు.

డోర్ మూసి వీల్ తిప్పారు.

మొత్తం తొంభై ఆరుగురు పాసింజర్స్.

పైలెట్ విజయ్ యూనిఫాం తీసి డ్రైవింగ్ సీటులో కూర్చున్నాడు. కంట్రోల్ రూమునుండి కాషన్‌కి ఎదురు చూస్తూ సెడ్ పైలెట్ కుమార్‌తో మాట్లాడుతున్నాడు.

టైము చూశాడు. తొమ్మిది పది హేను నిమిషాలయింది. కంట్రోల్ స్టేషన్ నుండి కాషన్ వినిపించింది.

స్టార్ట్ చేశాడు. క్లచ్‌ని బలంగా ముందుకి తీస్తూ స్టీరింగ్‌ను తిప్పుతూ రన్ వే త్రి నుండి మెల్లగా మెయిన్ రన్ వే మీదకు వచ్చింది. వేగం హెచ్చింది. ప్లెయిన్ షేక్ అవుతూ వుంటే ప్రయాణీకులందరూ కదులుతూ వున్నారు. రన్ వే లైట్ల మధ్యగా దూసుకుపోతుంది విమానం. కొన్ని క్షణాల తరువాత 'టచ్ అవ్' కంట్రోల్ కాషన్ వినిపించింది. స్టీరింగ్ పట్టుకొని బలంగా వెనుకకు లాగారు. నేలమీద పరుగుతీసిన విమానం గాలిలోకి ఎగిరిపోయింది. షేక్ అవటం ఆగిపోవటంతో ప్రయాణీకులు తాపీగా కూర్చున్నారు. చక్రాలు ముడుచుకుపోయాయి. ప్రయాణీకులు కిటికీలలో నుండి బయటకు చూస్తున్నారు.

ఆకాశంనిండా వున్న చుక్కలు, నేలమీద ప్రతిబింబిస్తున్నట్లున్నాయి నగరపు విద్యుద్దీపాలు. నగరం దూరమైపోయింది.

5

నోట్లో సిగర్ వెలిగిస్తూ ఆలోచిస్తున్నాడు రఘువీర్.

రఘువీర్ వయసు నలభైకి పైగా వుంటుంది. నల్లగా దృఢకాయంలాంటి శరీరం, ఎయిర్ కండిషన్‌లో పెంచటం చేత కాస్త మెరపు కలిగి వుంది. బ్రాందీ విస్కీలతో ఖరీదయిన కోడి పలావులతో పెంచిన దృఢమయిన ఆకారం, ఖద్దరు ధరించిన ప్రజానాయకుడులా వుంటాడు. అతని యింపాలా కారు చూస్తే గవర్నరుదేమో అనిపిస్తుంది. అతను అందులో ప్రయాణం చేస్తుంటే ముఖ్య మంత్రి విజిట్ చేస్తున్నట్లు భ్రమపడతారు.

ఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తాడు. "హాలో రఘువీర్ స్పీకింగ్."

"యస్, బాస్ నరేంద్రకు బాక్స్ యిచ్చాను."

"గుడ్. ప్లెయిన్ బయలుదేరిందా?"

"యస్ బాస్. బయలుదేరింది. నరేంద్రతోపాటు మన నాయకులు ఐదుగురు వున్నారు. క్లారా కూడా వుంది."

"గుడ్. నీవు నరేంద్రకు టైంబాబు ఇచ్చినట్లు ఎవరయినా అనుమానించారా?"

"లేదు బాస్. ఖచ్చితంగా తొంభై నిమిషాలలో ఆ బాంబు పేలుతుంది. అందులో సందేహం లేదు."

"కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ పాణి. నీవు వెంటనే గౌహాతి సెంటర్‌లో సుభాంజలి స్ట్రీట్‌లో వున్న ఇంటికి రా" ఫోన్ పెట్టేశాడు రఘువీర్.

ద్వారందగ్గర నిలబడింది క్లారాడయనా. తన సంభాషణ విందేమో క్షణం అనుమానించాడు. అయినా పెదవులపై నవ్వు తెచ్చుకుంటూ "ఏమిటి లూసీ, అక్కడే నిలబడ్డావు?" అన్నాడు నవ్వి.

"నా పేరుతో మా అక్కను న్యూయార్క్ పంపారా?"

"అవును. చాలా అవసరంగా. డియర్ లూసి."

"కారణం?"

రఘువీర్ సొరుగు తీశాడు. రూపాయలకట్ట అది.

"ఇక్కడ కార్యక్రమాలేగాని, కారణా లుండవు లూసి. ఇవిగో పదివేలు నీకు ఇష్టమయిన జాక్‌పాట్, నీ ప్రియమయిన రేసుగుర్రాలు బ్లూ మూన్, మిక్కీమౌస్, రెయిన్‌బో, బ్లాక్ డైమెండ్ పాల్గొంటున్నాయి" అంటూ అందించాడు. లూసి నవ్వుతూ అందుకుంది.

లూసియా, క్లారాడయానా అక్కచెల్లెళ్ళు. క్లారా డయానా రఘువీర్ పర్సనల్ సెక్రటరీగా వుంటూ రఘువీర్ బిజినెస్ వ్యవహారాలు చూస్తూ విదేశాలు తిరిగి వస్తుంది.

లూసియా క్లబ్ డాన్సర్‌గా వుంటుంది. క్లారాని క్రితం సారి కస్టమ్స్ అధికారులు అనుమానించారు. అందుకే పాస్‌పోర్టు రాలేదు. అందుకే లూసియా పేర పాస్‌పోర్ట్‌ను తెప్పించి క్లారాను పంపాడు. క్లారా ఇందులో ఏదో కుట్ర వుందనుకొని లూసినే పంపించి, తను లూసిగా ఇక్కడే వుంది.

ఆ విషయం రఘువీర్‌కి తెలీదు. విమానంలో వున్నది క్లారా అని తన రహస్యాలు అంతటితో అంతమవుతాయను కున్నాడు.

6

గౌహతి సెంటరులో సుభాంజలి స్ట్రీట్‌లో లూలు పేలస్ అది.

లూలు మిస్ ఇండియా కాంపిటీషన్‌లో సెలక్టయి ఆరోగ్యం సరిగా లేకపోవటంతో పాల్గొనలేదు. పాల్గొంటే

తనకే బహుమతి వస్తుందని ఆమె అభిప్రాయం. ఆమె ప్రస్తుతం రఘువీర్ చేతిలో సిగరెట్టు ముక్క.

"డార్లింగ్ లూలు. ఈవేళ నాకు చాలా శుభదినం. ఈ శుభ సమయంలో నీవు ఏమడిగానా ఇస్తాను," అన్నాడు బిగియార కౌగలించుకొని.

బెల్ బాటమ్ పాంట్, బ్రా షర్ట్ వేసుకున్న లూలు, వదుల్కు తల అరచేతి వెడల్పు అద్దాలు, పెదవుల లిప్ స్టిక్ మనోహరంగా వుంటుంది. ఎదిగిన రొమ్ములు, ఎత్తైన పిరుదలు.

క్లారాడయానా కిటికీలో నుండి చూస్తోంది. ఏం మాట్లాడుతున్నదో వింటోంది. క్లారాడయానాకు తెలుసు. రఘువీర్ ఎప్పుడు ఎక్కడ వుంటాడో ఎప్పుడు ఎవర్ని వదిలేస్తాడో.

"ఏమిటి డార్లింగ్ అంత శుభవార్త?"

"మన పార్టీ ఎందరు ఐమిాన్ ఎందరం కలసి యీ పథకంలో లక్షలు విలువచేసే బంగారం, కోట్లకు పైగా విలువగల వజ్రాలు సాధించాం."

"మొత్తం ఆరుగురు, మీరుగాక ఐదుగురు."

"గుడ్. రేపు వాళ్ళు వుండరు."

"అంటే?" ప్రశ్నార్థకంగా చూసింది.

"అవును డార్లింగ్! బోయింగ్ 707 లో అందరూ ప్రయాణం చేస్తున్నారు. అందరితోపాటు నా రహస్యాలు తెల్సిన క్లారా కూడా వుంది. వీరంతా సముద్రం పాలవుతారు."

"సరిగ్గా చెప్పు డార్లింగ్."

"యస్ బోయింగ్ 707 లో టైంబాంబు పెట్టాము. అది తెలియకుండా నరేంద్ర దగ్గరే వుంది. అది తొంభై

నిమిషాలలో పేలుతుంది. విమానం, విమానంతో పాటు అందరు సముద్రం పాలు. బంగారం వజ్రాలు మన పాలు. ఎలా వుంది మన ప్లాను."

"ఓ, డార్లింగ్ నీదెంత జీనియస్ మైండ్."

"అవును నీలాంటి అందాలరాశిని అందుకొంటే ఐడియా లొస్తాయి."

"అవును డార్లింగ్ నీవు లేకుండా వాళ్ళంతా బోయింగ్ లో ఎలా వెళుతున్నారు? నీవు బంగారం, వజ్రాలు తీసుకుంటావని తెలీదా?"

"తెలీదు. ఆఖరు రోజు నేను నరేంద్రలా మేకప్ చేసుకున్నాను. నేను నరేంద్రను ఎన్నుకున్నదే అందుకు. ఇది హిట్లర్ పథకం. బ్లూ రూములో నన్ను చూసిన వాళ్ళు ఆ మసక వెలుతురులో నరేంద్ర నేనని అనుకుంటారు. ఎయిర్ పోర్ట్ లో ఎవరు ఎవరితో మాట్లాడరు. ఎవరితో ఎవరు రహస్యంగా మాట్లాడినా అందరికి వినిపిస్తుంది. ప్లెయిన్ లో నరేంద్రే వాళ్ళ బాస్" పకాలున నవ్వాడు.

కంగారుగా పరుగెత్తుకు వచ్చాడు పాణి. "బాస్ పాండే దొరికిపోయాడు. పోలీసులు అతనింటిని సోదా చేయటానికి వస్తున్నారు,"

"అంటే ఇక్కడకు వస్తారా?"

"రావచ్చు. లాలు తమ్ముడని తెలిసిపోయింది" అంటూ కిటికీ వైపు చూశాడు. "బాస్, క్లారా!" రఘువీర్ గబాలున తిరిగాడు.

"కాల్చిపారెయ్ ఇడియట్ ని" అరిచాడు క్రోధంగా.

క్లారా గార్డెన్ లోనుండి ఫౌంటెన్ ప్రక్కగా పారిపోతుంది. పాణి రివాల్వర్ పేల్చాడు. గురి తప్పింది. మళ్ళీ

పేల్చాడు. బుల్లెట్ గుండెల్లో దూసుకుపోవటం విసరినట్లు రోడ్డుమీద పడిపోయింది.

అప్పుడే వచ్చి ఆగిన పోలీస్ జీపులోనుండి ఇన్ స్పెక్టర్ జాన్సన్, పాణిని పేల్చాడు. పాణి నేలకూలాడు.

గుండెను గుప్పిటితో పట్టుకుంది క్లారా. ఇనస్పెక్టర్ ముఖం లోనికి చూసింది.

పోలీసులు ఇంటిని ముట్టడించారు.

"ఇనస్పెక్టర్... బోయింగ్... 7...0...7...లో" మాట తడబడిపోతూంది కళ్ళవెంట నీరు, ముఖమంతా చెమటలు పోశాయి. ఆయాసంతో బలంగా అంది. "7...0...7 లో టైంబాంబు వుంది... అది... అది" అంటూ ప్రక్కకు ఒరిగిపోయింది. కళ్ళు నోరు తెరిచే వుంది.

ఇనస్పెక్టర్ గుండెలు దడదడలాడాయి. పిలిచాడు పలుకలేదు, స్పృహాలో లేదు.

"బోయింగ్ 707 లో టైంబాంబు" అనే మాట దిక్కులు పిక్కటిల్లేలా వినిపించసాగింది ఇన్ స్పెక్టర్ జాన్సన్ కి. భయం, ఆందోళన, కంగారుగా క్లారాను మరో ఇనస్పెక్టర్ కి అప్పగించి, అరవై మైళ్ళ వేగంతో ఎయిర్ పోర్టు చేరాడు.

ఆతృతగా ఎయిర్ పోర్ట్ జనరల్ మేనేజర్ దివ్యేంద్ర రూము లోనికి వెళ్ళాడు.

"సర్. చాలా ప్రమాదకరమయిన పరిస్థితి" తడారి పోయిన గొంతుకతో తడబడుతూ చెపుతున్నాడు.

"ఏమిటది?"

"బోయింగ్ 707 లో టైంబాంబు వుంది."

"వాట్" అదిరిపడ్డాడు.

"అవును సర్. ఆ రహస్యం తెలియనీయకుండా ఓ అమ్మాయిని చంపారు, ఆమె ఇచ్చిన సమాచారం ఇది."

"అది ముందే విమానంలో వుందా? ప్రయాణీకులు ఎవరయినా వెంటతీసుక వెళ్ళారా" ఆతృతగా అడిగాడు.

"తెలీదు సర్. అప్పటికే ఆమె స్పృహ కోల్పోయింది. ఆమెకు ఇప్పటిలో స్పృహ రాకపోవచ్చు. చచ్చిపోవచ్చు."

"ఐ. సి" అంటూ ఫోన్ రింగ్ చేశాడు. "హలో. ఎయిర్ లైన్ ఇంజనీర్ దేవి ప్లెయిన్ని బాగా చెక్ చేశారా? విమాన్ బోయింగ్ 707లో టైంబాంబు వుందట. మీ చెకింగ్ ఇన్ఫర్మేషన్ ఏమిటి?"

"బోయింగ్ 707 ని అణువణువు చెక్ చేశాం. అలాంటిదేమి ప్లెయిన్లో లేదు," అవతల నుండి వినిపించింది.

వెంటవెంటనే నెంబర్సు డయల్ చేసి ఎయిర్పోర్టుకు సంబంధించిన ముఖ్యమయిన ఆఫీసర్లని పిలిపించాడు.

రిజిర్వేషన్ కౌంటర్ నుండి ప్రయాణికుల పేర్లుగల చార్టు తెప్పించాడు. బోయింగ్ ఎన్నిమైళ్ళ దూరం వెళ్ళి వుంటుందో తెలుసుకున్నాడు. అందరూ ఒక్కొక్కరు రూములోనికి వచ్చి కూర్చున్నారు.

ఇనస్పెక్టర్ జాన్సన్ చెప్పిన సమాచారం అందరికి చెప్పాడు.

అందరి ముఖాలు రంగులు మారాయి.

7

బోయింగ్ 707 వేగంగా మేఘాలకు పైగా దూసుకు పోతోంది. చుట్టూ శూన్యమయిన చీకటి, ఆ చీకటిలో

అద్దివట్టున్న నక్షత్రాల గుంపులు, అక్కడక్కడ ఉల్కలు కనిపిస్తున్నాయి. క్రింద పైన శూన్యంగా వుంది. ఆ విమానం ఎక్కడ వుందో? ఎవరికి తెలీదు.

విజయ్ రీడింగ్ చూస్తున్నాడు.

"వాటీజ్ యువర్ పొజిషన్" కంట్రోల్ నుండి ప్రశ్న.

"ఆరువేల ఐదువందల అడుగుల ఎత్తులో వెళుతున్నాము. గంటకి ఐదువందల పాతిక మైళ్ళ వేగం. ఉయ్ ఆర్ ఓ. కె" అన్నాడు. ప్లెయిన్‌ని స్టడీలో వుంచి లోపలకు వచ్చాడు.

ఎయిర్ హోస్టెస్ చాక్‌లెట్సు, బిస్కట్స్ పాసింజర్స్‌కి అందిస్తూన్నారు. అవసరమయిన వాళ్ళకు సిగరెట్సు ఇస్తూ నవ్వుతున్నారు.

నరేంద్ర, లూసి ప్రక్కప్రక్కనే కూర్చొని లూసి డాన్స్ గురించి మాట్లాడుతున్నాడు.

"హియర్ యీజ్ మెసేజ్ నోట్" కంట్రోల్ నుండి వచ్చిన మెసేజ్ వింటూ చిన్న పాకెట్ బుక్ తీశాడు అసిస్టెంట్ పైలెట్ కుమార్. "ఎ టైంబాంబ్ ఇన్ ప్లెయిన్. అది ఎవరిదగ్గర వుందో తెలీదు ప్రతి వ్యక్తిని సస్పెక్ట్ చేయాలి. మళ్ళీ కొన్ని క్షణాలలో ఫోన్ చేస్తాం. బి కేర్ ఫుల్" అన్నాడు వర్మ.

కుమార్ ముఖం రంగు మారిపోయింది. గొంతు తడారిపోయింది. ప్రక్కనే కూర్చోబోతున్న విజయ్‌కు అందించాడు సమాచారాన్ని. విజయ్ గుండె గబగబ కొట్టుకుంది. చావు సహజం. తను భయపడడు. కాని తన ప్రయాణీకులు? ఆందోళనగా, ఆతృతగా ఎయిర్ హోస్టెస్ రాణి చెవిలో రహస్యంగా చెప్పాడు. రాణి భయకంపితురాలయింది.

"భయపడక ఇక్కడ శక్తిసామర్థ్యాలకంటే ధైర్యం కావాలి."

"అలాగే" అంది రాణి.

విజయ్ సిగరెట్ వెలిగించి ఒక్కొక్కరిని నిశితంగా చూస్తూ నడుస్తున్నాడు, వారి బాక్స్‌ల్ని అనుమానంగా చూస్తున్నాడు.

తెలిసి టైంబాంబ్ ఎవరు విమానంలో తేస్తారు. ఇది తమకు తెలియకుండానే తమ బాక్స్‌లో వుండివుండాలి. అలాంటప్పుడు అందరికి చెప్పినా కంగారుపడటం తప్ప ప్రయోజనం లేదు. అటునుండి ఇటు, ఇటునుండి అటు రెండుసార్లు నడిచాడు. లేని నవ్వు పెదవులమీద ప్రదర్శింప చేసుకుంటూ పాసింజర్స్ ఇబ్బందుల్ని పరామర్శించాడు.

బాంబు ఎప్పుడు? ఎలా పేలుతుందో విజయ్‌కి తెలీదు.

ఏ క్షణంలో తన ప్రాణాలు పోతాయో అర్థంకావటం లేదు.

ప్రయాణీకులు కొందరు నిద్రపోతున్నారు, కొందరు చదువుకుంటున్నారు.

లూసి కళ్ళు మూసుకొని నిద్రపోతోంది. నందలాల్ కెమికల్ బుక్ చదువుతున్నాడు. నరేంద్రకు నిద్రరావటం లేదు.

8

"మిస్టర్ పాండే, నీవు నేరసుడవు కాకపోవచ్చు. అయినా మా దృష్టిలో నేరస్థుడివి, నీవు ఒక్క సహాయం చేస్తే నిన్ను వదిలేస్తాం?" ప్రాధేయపూర్వకంగా అడిగాడు క్రిమ్‌బ్రాంచి ఇన్‌స్పెక్టర్ జాన్సన్.

"ఏమిటా సహాయం?"

"వందమంది ప్రాణాలు నీ చేతుల్లో వున్నాయి. స్వదేశీలు, విదేశీలతో వున్న విమానంలో బాంబు వుంది. అది ఎవరిదగ్గర వుందో తెలియటంలేదు. నీకు హత్యచేయబడ్డ యువతికి సంబంధం వుంది. అలాగే ఆమెకు విమానంలో బాంబుకు సంబంధం వుంది. విమానంలో వాళ్ళను రక్షించాలని తనకు తానే ఆహుతి అయింది. కాబట్టి నీకు గాని, ఆమెకుగాని సంబంధించినవాళ్ళు యీ లిస్టులో వున్నారేమో చూడు," పాసింజర్స్ చార్ట్ అందించాడు.

వరుసగా పేర్లు చూస్తున్న పాండే ఓ చోట ఆగాడు.

ఏదో సందేహిస్తున్నాడనుకుని "మిస్టర్ పాండే! ఈ ఆపదనుండి విమానాన్ని, అందులో అమాయక ప్రయాణికుల్ని రక్షించగలిగితే నీవు నిజంగా నిర్దోషివే. లేదా ఆ విమాన ప్రమాదంతో నీకుకూడా సంబంధం వుందని భ్రమపడాల్సి వస్తుంది."

"ఆ ప్రమాదం తప్పితే విడుదల చేస్తారా?"

"తప్పనిసరిగా."

"హత్యచేయబడ్డ అమ్మాయిలాంటి మరో అమ్మాయి విమానంలో వుండివుండాలి. ఆమె పేరు యిందులో లూసి అని వుంది. కాని క్లారా అనే అమ్మాయి సహజంగా న్యూయార్క్ వెళ్ళి వస్తుంది. వాళ్ళిద్దరు కవలపిల్లలు. రఘువీర్ గాంగ్‌తో వారికి సంబంధం వుంది."

"గుడ్. థాంక్స్ వెరీ మచ్" అన్నాడు దివ్యేంద్ర.

ఫోనెత్తి రింగ్ చేశాడు. "ఈజ్ ఇట్ రిజర్వేషన్ కౌంటర్. లూసి అనే అమ్మాయి బోయింగ్ 707 లో ప్రయాణం చేస్తుందా."

"యస్ సర్."

"ఆమె పాస్‌పోర్ట్ ఫొటోకి, ఆమెకి తేడా వుందా?"

"నో సర్. కానిస్టైన్ చేసేటప్పుడు కాస్త తొట్రుపడింది. వేలుకు దెబ్బ తగలటంచేత కాస్త మార్పు వచ్చింది అని చెప్పింది." నెంబరు మార్చాడు దివ్యేంద్ర.

"కంట్రోల్ స్టేషన్ బోయింగ్ 707 లో లూసి అనే అమ్మాయి దగ్గర బాంబు వుంది. చెక్ చేయమను," అన్నాడు దివ్యేంద్ర.

కంట్రోల్ నుండి బోయింగ్ 707 కి మెసేజ్ పంపబడింది.

మెసేజ్ అందుకున్నాడు విజయ్.

9

"రాణి చెక్ ది 26 నెంబరు సీట్ లూసి" అన్నాడు విజయ్.

రాణి ఆతృతగా వెళ్ళి లూస్‌ని పిలచింది పైలెట్ ఆఫీసర్ రమ్మంటున్నారని. లూసి నరేంద్రను ఒకసారి చూసి లోపలకు నడిచింది.

"మీ దగ్గర టైం బాంబు వుందా?" విజయ్ ప్రశ్నించాడు ఆమె ముఖంలోనికి చూస్తూ. లూసి చకితురాలయింది. "మిస్ లూసి మీకు తెలియకుండా మీ దగ్గర టైం బాంబు వుండవచ్చు."

"నన్నే ప్రత్యేకంగా ఎందుకు పిలిచారు?"

"కారణాలు తెలియవు. శాంతక్రూజ్ కంట్రోల్ స్టేషన్ నుండి చెప్పిన మెసేజ్ యిది. మీ ఆర్టికల్స్ చెక్ చెయ్యాలి."

"నాకేం తెలియదు" చివాలున వెనుతిరిగి వెళ్ళిపోయింది.

విజయ్‌కు మతి పోయినట్లయింది. అలా వెళ్ళిన లూసి నరేంద్రను చూస్తూ బాత్ రూములోనికి నడిచింది. రాణి అనుసరించింది. క్షణాలు, నిమిషాలు గడుస్తున్నాయి. రాణి ద్వారం దగ్గరే వుంది. కొన్ని నిమిషాల తరువాత లూసి విసురుగా వస్తూ రాణి చేతిలో మడిచిన కాగితం పెట్టింది. అది యెవరూ చూడలేదు.

ఆ కాగితంతో విజయ్ దగ్గరికొచ్చింది రాణి.

"సారి సార్,

నేను అబద్ధం చెప్పాను. ఈ ప్లెయిన్‌లో ఒక స్మగులింగ్ ముఠాకి చెందిన ఆరుగురున్నారు. వాళ్ళు ఎవరో వాళ్ళ పేర్లు నాకు తెలియవు. వాళ్ళలో ఎవరిదగ్గర టైంబాంబు వుందో తెలీదు. నేను మీతో ఏం మాట్లాడినా ఆ ఆరుగురికి వినిపిస్తుంది. అందుకే మాట్లాడలేదు. వాళ్ళను తెలుసుకోండి."

విజయ్ డ్రైవింగ్ రూమునుండి బయటకు వచ్చాడు. "డియర్ ఫ్రండ్స్ యిది చాలా ప్రమాదకరమయిన పరిస్థితి" అందరు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఆందోళనగా, భయంగా చూశారు. "ఈ ప్లెయిన్‌లో టైం బాంబుంది" చెప్పటం ఆపాడు.

కంగారు, కోలాహలం, అరపులు గోలయిపోయింది. రొదలు ఆరంభమయ్యాయి. "ప్లీజ్ సైలెన్స్" గట్టిగా అరిచాడు. "చూడండి, మన ప్రయాణీకులు కావాలని టైంబాంబు తెచ్చివుండరు. ఎవరి విద్రోహ చర్యలవల్లో బాంబు యీ విమానంలోనికి తేబడింది. ఇక్కడ బాంబు పేలితే ఏ ఒక్కరూ బ్రతకరు. కాబట్టి మీ మీ సామానులు చెక్ చేసుకొని, బాంబు వుందేమో చూడండి," విజయ్ వినయంగా విశదీకరించాడు.

అందరు తమ తమ బాక్సులు తెరిచి కంగారుగా వెదకసాగారు.

నరేంద్ర బాక్సు వెతికినట్లు నటించాడు. రెండో బాక్సు వెతకలేదు.

విమానం మబ్బులమీదుగా చుక్కల్లోనికి దూసుకుపో తుంది. అందరి గుండెల్లో ఒకటే అదురు, భయం, వణకు.

కొందరు దేవుడ్ని స్మరిస్తున్నారు. కొందరు బంధువుల్ని తలచుకుంటున్నారు. కొందరు బయటకు పారిపోవా లనుకుంటున్నారు.

నరేంద్రలో ఎన్నో సందేహాలు ప్రారంభమయ్యాయి.

తనదగ్గర పెట్టెలో వున్నది ఏమిటి? తనదగ్గర వున్నది టైంబాంబయి వుంటుందా? ఈ విషయం ఎవరు చెప్పి వుంటారు? తనకు టైంబాంబు యిచ్చి ప్లెయిన్ ఎందుకు కూల్చాలనుకుంటాడు? దీని వెనకేదయినా నాకు తెలియని కుట్ర వున్నదా? ఎయిర్‌పోర్టులో యిచ్చిన పెట్టెలో ఏముంది?

ప్రయాణీకుల రణగొణ ధ్వని, బెంబేలు పడుతున్న మాటల ఘోష, బ్రతికిపోవాలనే ఆరాటం, తాపత్రయం. విమానంలో వున్న అందరి గుండెల్లో విమానాలు పరుగెడు తున్నాయి.

లూసి హతాశురాలయింది. చిన్నపిల్లాడు తల్లి డీలా పడి పోయింది. మాజీమంత్రి చేసిన పాపాలకు క్షమాపణ భగవంతుడ్ని వేడుకొంటున్నాడు, తన ప్రాణాల్ని కాపాడ మని మరోసారి చంపుకోమని ఒక పారిశ్రామిక వేత్త దేవుడ్ని ఆరాధిస్తున్నాడు.

ఎయిర్ హోస్టెస్ రాణి ఒకవైపు భయంగా వున్నా మరోవైపు ప్రయాణీకుల దుస్థితికి జాలిపడుతూ వుంది.

పసివాడు మాత్రం మురిపెంగా నవ్వుతున్నాడు.

పైలెట్ విజయ్ అందరివైపు చూసి "డియర్ పాసింజర్స్ యిప్పుడు మీకొక చక్కని సన్నివేశం చెపుతాను. బైబులులో కథ యిది. భగవంతుడు యోనా అనే వ్యక్తికి నీనెవె పట్టణం నాశనం కాకుండా చూడమని పంపుతాడు. కాని యోనా ఆ వూరి ప్రజలకు భయపడి మరో వూరికి ఓ ఓడలో ప్రయాణమవుతాడు. భగవంతుడు ఆగ్రహంతో సముద్రంమీద భయంకరమయిన తుఫాను సృష్టిస్తాడు. ఆ తుఫానుకు భయపడి అందరు చనిపోతారని తీర్మానించుకున్న ఓడ నావికుడు భగవంతుడ్ని ప్రార్థించుకొమ్మంటాడు. అందరూ దేవుడ్ని స్మరిస్తారు.

యోనామాత్రం ఓడ అడుగున నిద్రపోతూ వుంటాడు. నావికుడు అతన్ని లేపి నీవు ప్రార్థించు కనికరిస్తాడేమో భగవంతుడు అంటాడు. వారిలో ఒకరు ఎవరినిబట్టి యీ కీడు సంబంధించిందో తెలుసుకొనటానికి లాటరీ చీట్లు వేస్తారు. ఆ చీటి యోనా మీదికి వస్తుంది. అందరు యోనాని అడుగుతారు.

యోనా తన చరిత్ర చెప్పి, యీ తుఫానుకు కారణం నేనే, నన్ను సముద్రంలో వేయండి అంటాడు. వేస్తారు. తుఫాను ఆగిపోతుంది.

యోనాను ఓ చేప మింగి నీనెవె పట్టణంలో కక్కుతుంది. యోనా బ్రతికి నీనెవె పట్టణ ప్రజలకు బోధిస్తాడు. ఇప్పుడు మనలో ఒక యోనా వున్నాడు. మన చుట్టు తుఫాను వుంది. ఒక వ్యక్తి వల్ల ఎందరు అమాయకులు నామరూపాలు లేకుండా పోతారో ఆలోచించండి."

నరేంద్ర ఆలోచన లేకుండా గబాలున పెట్టి తెరిచాడు.

ఎట్టి పరిస్థితిలో రెండు గంటల్లోపు తెరవద్దన్న పెట్టి, బాస్ ఆజ్ఞ మీరితే ప్రాణాలు పోయినట్లే, అయినా సరే తెరిచాడు.

లోపల ముళ్ళు తిరుగుతోంది. నుదురు చిట్లించాడు. లూసి చూసింది. మరో వ్యక్తి, యింకో వ్యక్తి అందరు చూసి కొందరు 'టైం బాంబు' అని అరిచారు. పైలెట్ విజయ్ గబాలున అందుకున్నాడు.

బాంబు పేలటానికి తొంభై సెకన్లమాత్రం వుంది.

విజయ్ చేతులు వణుకుతున్నాయి. ఆ బాంబును ఏం చేయాలి? బయటకు విసరాలి, దాదాపు ఆరువేల అడుగుల ఎత్తులో వెళుతున్న విమానం, ఆరువందల పాతిక మైళ్ళ వేగంతో పోతుంది. డోర్ తెరిస్తే ప్రయాణికులు ఎలా అవుతారో. లోపల కాగితాలు, బట్టలు అల్లకల్లోలం అవుతాయి. ఆక్సిజన్ లోపిస్తుంది. విపరీతమయిన చలి వీస్తుంది.

ఇవన్నీ ప్రయాణికులకు తెలీదు. 'బయటకు విసురు' అరుస్తున్నారు.

విజయ ఉపేక్షించలేదు. ఆతృతగా డోర్ దగ్గరకు నడిచాడు. రెండు బెల్టులు తీసి నడుంకి చేతులకు కట్టుకున్నాడు. డోర్ చక్రం తిప్పాడు.

ఇంకా యిరవై సెకన్లమాత్రం వుంది.

టైంబాంబు విసరలేదు. అందుకే డోర్ దగ్గర క్రింద పెట్టాడు, ప్రయాణికులకు కాషన్ యిచ్చాడు. అందరు కోడిపెట్ట రెక్కలక్రింద కోడిపిల్లల్లా, బండక్రింద కప్పల్లా ఒదిగి, బిగుసుకుపోయారు.

తలుపు తెరిచాడు. రఁయ్‌మంటున్న గాలి తెర.

హోరుమంటూ భయంకరమయిన గాలి లోపలకి ప్రవేశించింది. ఆరువందల మైళ్ళ వేగంతో లోపలకు ప్రవేశించిన

గాలికి విమానం అటు యిటు జరిగింది.

విజయ్ తూలి వెనక్కు పడ్డాడు. గాలి విసురుకు ముందుకు వంగలేక పోతున్నాడు. విమానం అటు యిటు వూగుతోంది. టైంబాంబు సమయం దగ్గరయిపోతోంది.

విజయ్ చటుక్కున బోర్ల పడుకొని టైంబాంబు దగ్గరకు జరిగి, గభాలున తన్నాడు.

టైంబాంబ్ ఆ దెబ్బతో డోర్‌గుండా బయటకు పడిపోయింది. మరుక్షణంలో 'ఢాం' మని పేలింది. కాని విధివశాత్తు బాంబ్‌లో చిన్నముక్క విమానం కిటికీ పగలగొట్టి, పై సీలింగ్‌కు తగిలింది.

దాంతో గాలి మరింత విజృంభించింది. ఆ విజృంభణకు విమానం వూగిపోయింది. ఆ వూగటంతో విజయ్ డోర్ నుండి విసిరినట్లు బయటకు పడిపోయాడు. కాని బెల్టులు వుండటంచేత వేలాడుతున్నాడు.

విమానం బాగా షేక్ అవటంతో వింగ్స్ క్రిందకి పైకి వూగాయి. కుమార్ కుడివైపు భుజానికి వున్న క్లిప్ తెగిపోయింది. కుమార్ తూలి ప్రక్కకు పడిపోయాడు. అలా పడటంతో వైర్స్ పైన కుమార్ చేతులు పడ్డాయి. స్టీరింగ్ రాడ్‌కి తల తగిలింది. స్పృహ కోల్పోయాడు.

కిటికీలోనుండి హోరుమంటున్న గాలి భయంకరంగా వస్తుంది. విమానం చల్లబడిపోతుంది.

డ్రైవింగ్ లేని విమానం వింగ్స్ అటు యిటు కదులుతూ, వూగుతూ నేలకు ముఖంపెట్టి వచ్చేస్తుంది. నేలకు వస్తున్న విమానం డోర్ బయట ఉరేసిన శవంలా విజయ్ వేలాడుతున్నాడు. క్రింద మేఘాలు దగ్గరవుతున్నాయి.

విమానం దిశ మారిపోయింది.

రాణి అతి ప్రయత్నంమీద పైలెట్స్ రూములోనికి

వెళ్ళింది. కుమార్ స్పృహలో లేడు. విమానం యిలాగే వెళ్ళితే కొన్ని నిమిషాలలో నేలను ఢీకొంటుంది. ప్రయాణీకులు బెంబేలు పడుతున్నారు.

క్షణాలు, నిమిషాలు జరుగుతున్నాయి.

10

క్రిందకు దూసుకువస్తున్న విమానం ద్వారం బయట వేలాడుతున్నాడు విజయ్. రాణి ఆక్సిజన్ స్విచ్ నొక్కింది. ప్రయాణికులందరికి ఆక్సిజన్ ట్యూబ్స్ వచ్చాయి. అందరు ముక్కులకు తగిలించుకున్నారు. తగిలించుకోనేటందుకు శక్తి లేనివారికి తగిలించారు.

నరేంద్రకు అంతా మాయగా కలగా వుంది. తనవల్లే యింత ఘోరం జరిగినందుకు కుమిలిపోయాడు. విమానంలో తూలుతూ పడుతూ ఆత్రంగా వెళ్ళి రెండు ట్రేలు తీసుకొని పగిలిన అద్దం ఖాళీలో యిరికించాడు. అలా యిరికించినపుడు వేళ్ళు కోసుకుపోయాయి. గాలి హోరు తగ్గింది. విమానం క్రిందకు వెళ్ళిపోతోంది. అలా వెళ్ళిపోతే ఏ కొండకో ఢీకొంటుంది.

గబగబ పైలట్ రూములోనికి వెళ్ళి స్టీరింగ్ బాగా వెనుకకు లాగాడు. విమానం మెల్లగా పైకి లేచింది. ఇంకా ఏం చేయాలో తనకు తెలీదు. అదయినా తన క్లాస్ మెట్ సంభాషణలో విమానం డ్రైవింగ్ గురించి చెప్పిన గుర్తు.

డోర్ దగ్గరకు వచ్చాడు. డోర్ బయటకు వుంది బెల్ట్. తను ఒక బెల్ట్ నడుముకు తగిలించుకున్నాడు. డోర్ కొద్దిగా తెరచి, విజయ్‌ను పైకి లాగాడు. ఎంతో ప్రయత్నంమీద పైవరకు వచ్చాడు. తలుపు తెరవండే విజయ్

రాదు. తలుపు తెరిస్తే సుడిగాలి లోపలకు వస్తుంది. అప్పటికే శ్వాస పీల్చటం కష్టమవుతోంది. తను నడుంని డోర్ వీల్‌కి కట్టి డోర్ తెరచి విజయ్‌ను లోపలకు లాగాడు. విమానం కుడివైపుకు వంగటంతో డోర్ బలంగా పడిపోయింది. డోర్ వీల్ గబగబ తిప్పాడు.

విజయ్ స్పృహలో లేడు, నాడి అందటంలేదు.

ఎయిర్‌లైన్స్ డాక్టర్ విజయ్‌కి కోరమిన్ ఇంజక్షన్ చేశాడు. చేతులు కాళ్ళు చల్లబడిపోయినపుడు వాటిలో వేడి పుట్టించటానికి అలా చేస్తారు. బెల్టు విప్పి కరెంట్ షాక్ లాంటిది యిచ్చారు. రాణి కంగారుగా చూస్తుంది. డాక్టర్ హార్ట్ బీటింగ్ చూస్తున్నాడు.

నరేంద్ర మరోసారి పైలెట్ రూములోనికి వెళ్ళాడు. స్టీరింగ్ మళ్ళీ పైకి లాగుతుండగా కుమార్ కాస్త కదిలి తల విదిలించాడు.

మూడువేల అడుగుల డౌన్‌లో వుంది విమానం, ఏడు వందల మైళ్ళ వేగంతో పోతుంది. ఇదే వేగం కొన్ని నిమిషాలు కంటిన్యూ అయితే హీట్‌వల్ల ప్రొపెల్లర్స్‌లో మంటలు ప్రారంభమయ్యేవి.

నరేంద్రను చూసి "థాంక్స్" అన్నాడు స్టడీ అవుతూ. అయితే కంట్రోల్ రూమ్‌నుండి మెసేజ్ వినిపించటం లేదు.

చుట్టూ అంధకారం, పైన చుక్కలు, క్రింద మబ్బులు తప్ప ఏం కనిపించటం లేదు.

ఆ మబ్బులలో కొండలు వున్నాయో మరేదయినా విమానం ఎదురవస్తుందో, విమానం ఎక్కడుందో తెలియటం లేదు. ఇలా ఎంతదూరం ప్రయాణం సాగించాలో

అది తెలీదు. చీకటిలో విసిరిన రాయిలా వెళ్ళిపోతుంది విమానం.

కుమార్ విమానాన్ని విధిగా క్రిందగా పోనివ్వాల్సి వచ్చింది. లోపలవున్న మంచులాంటి గాలి పోవాలంటే, ప్రయాణీకులు సరైన ఆక్సిజన్ పీల్చాలనుకుంటే రెండు వేల అడుగుల క్రింద వెళ్ళాలి. అలా వెళ్ళటం జరిగితే విమానం ఏ కొండకయినా ఢీకొనవచ్చు.

రాణి వచ్చింది "విజయ్ ఎలా వున్నారు?"

"ఫర్వాలేదు, త్వరలో స్పృహ రావచ్చు."

కొన్ని నిమిషాల తర్వాత విజయ్‌కు స్పృహ వచ్చి కళ్లు తెరిచాడు.

విమానమంతా చల్లగా ఐపోయింది. మంచులో పాతేసి నట్లు ప్రయాణీకులంతా వణికిపోతున్నారు. స్టీమ్‌స్విచ్ వేశాడు విజయ్. విమానంలో గాలి వేడిగా రాసాగింది.

ప్రతిఒక్కరికి బ్రాండి ఒక పెగ్ యిచ్చారు. కొందరు సిగరెట్లు వెలిగించారు. కొందరు ఆక్సిజన్ పీలుస్తున్నారు.

విజయ్ ముందు భాగంలోకి వచ్చాడు.

కంట్రోల్ నుండి మెసేజ్ లేదు. విమానం ఎక్కడికి పోతుందో అంతు పట్టటం లేదు. వేగం తగ్గించాడు.

ఉన్నట్టుండి "హలో బోయింగ్ 707...707...707" కంట్రోల్ నుండి వినిపించసాగింది.

"యస్ రిసీవింగ్ మెసేజ్."

"టచ్ అప్ వెయ్యి అడుగులు పైగా విమానం నడ పండి క్విక్."

విమానంలో విజయ్ గభాలున స్టీరింగ్ లాగాడు. విమానం పక్షిలా పైకి దూసుకుపోతుంది. మేఘాలు తేలి

నాయి. ఎదురుగా నల్లగా కొండ కనిపిస్తుంది. కొండకు మధ్యభాగంలో వుంది. మళ్ళీ లాగాడు.

విమానం క్రమంగా పైకి లేచింది. అయినా ప్రయోజనం లేదు. యింకా అరమైలు దూరంలో ఐదు వందల అడుగుల ఎత్తు లేవాలి. విమానం ప్రక్కకు తిప్పాడు. సర్కిల్ తిరిగింది.

ఆ సర్కిల్లో మరేదయినా కొండ అడ్డమొస్తే ఢీకొలవలసింది. కాని రెండో రౌండ్లో కొండ అంచుపైగా దూసుకుపోయింది విమానం.

విమానంలో దబాలున శబ్దం, కేకలు, అరపులు వినిపించాయి.

విజయ్ డోర్ తెరిచి చూశాడు. పైనవున్న సీలింగ్ ముక్క విరిగి పడింది. యింకా మిగిలింది కూడా పడిపోయే సూచనలా వుంది. త్వరలో ఏదైనా ఎయిర్ పోర్ట్ చేరుకోవాలి.

"హలో... శాంతాక్రూజ్ ఎయిర్ పోర్ట్!"

"యస్ బోయింగ్ 707... మేము ఎక్కడున్నాము? ఎలా కొన్ని నిమిషాలలో రన్ వే కావాలి లేదా విమానం సీలింగ్ ముక్కలుగా విరిగి పడిపోవచ్చు."

"యస్ మీరు ప్రస్తుతం సూరత్ మీదుకు తిరిగి హిమాలయ పర్వత ప్రాంతాలకి వచ్చారు."

విజయ్ విస్తుపోయాడు. ఎటు వెళ్ళవలసిన ప్లెయిన్, ఎటు వచ్చిందో అనుకొంటే నవ్వొచ్చింది.

"లెఫ్ట్ తిప్పి డైరెక్టు చేయండి రన్ వే క్లియర్ చేస్తున్నాం. తిరిగి శాంతాక్రూజ్ కు వచ్చేయండి."

"యస్. థాంక్స్యూ" అంటూ విమానం టర్న్ చేశాడు.

"ఇందాక మెసెజ్ అందలేదు."

"వైర్స్ తెగిపోయాయి అటాచ్ చేశాము."

"వాట్ ఎబవుట్ టైంబాంబ్?"

"బయలుదేరిన తొంభై నిమిషాల తరువాత టైంబాంబు పేలింది. బయట పేలటంతో విమాన ప్రమాదం తప్పింది కాని బాంబు ముక్క ఒకటి కిటికీ అద్దం నుండి పై సీలింగుకు తగిలింది. సీలింగ్ ముక్కలుగా విడిపోయేలా వుంది."

11

క్రైంబ్రాంచి ఇన్‌స్పెక్టర్ జాన్సన్, జనరల్ మేనేజర్ రూములోకి వచ్చాడు. "ప్లెయిన్ ఏమయింది?"

"ప్రస్తుతం క్షేమంగానే వుంది" దివ్యేంద్ర అన్నాడు.

"అయితే బాంబు దెబ్బకు సీలింగు పగిలి వుండాలి."

"థాంక్‌గాడ్. క్లారాకి స్పృహ వచ్చింది."

"ఏం చెపుతోంది?"

"ఒక స్మగ్లింగ్ ముఠాకి చెందిన ఆరుగురు బోయింగ్ 707లో వున్నారని వార్ని హతమార్చడానికి రఘువీర్ అనే వ్యక్తి కుట్ర పన్ని టైంబాంబు పెట్టాడని చెప్పింది. అంతేకాదు, ప్లెయిన్‌లో తన చెల్లెలు లూసి అనే అమ్మాయి వుందని ఏడుస్తోంది."

"బాంబు ఎవరి దగ్గర వుంది?"

"నరేంద్ర అనే యువకుడి దగ్గర. అతని ఫోటో కావాలి."

"దేనికి?"

"అతని ద్వారానే రఘువీర్‌ను పట్టుకోవచ్చు. నరేంద్రకు, రఘువీర్‌కు చాలా దగ్గర పోలికలున్నాయట. స్మగు

లింగ్ ముతా కూడా నరేంద్ర నే రఘువీర్ అని భ్రమ పడ్డారంటే చాలా పోలికలుంటాయి."

"మరి నరేంద్ర తిరిగి రావాలి కదా!"

"అవును. కాని ఈలోపు రఘువీర్ పారిపోకుండా ఎయిర్‌పోర్టులో రఘువీర్ పేర పాస్‌పోర్టు యిష్యూ చేయ కూడదు."

"ష్యూర్! అందుకు గట్టిచర్య కావాలి."

జనరల్ మేనేజర్ దివ్యేంద్ర ఫోన్ రింగ్ చేశాడు.

"హాలో రిజర్వేషన్ కౌంటర్, రఘువీర్ పేరుతో ఎవరికయినా పాస్‌పోర్టు యిష్యూ చేశారా?"

"జెస్ట్ ఎ మినిట్" అంటూ కొన్ని క్షణాల తరువాత వినిపించింది___

"యస్ సర్. జంబో జెట్‌లో కాలిఫోర్నియాకు ఇవ్వ బడింది."

"థాంక్యూ" అని ఫోను పెట్టి ఇనస్పెక్టర్ జాన్సన్ వైపు చూశాడు.

"జంబో జెట్‌లో రఘువీర్ అనే ప్రయాణీకుడున్నాడు. అతను, ఇతను ఒకదేనేమో సెక్యూరిటీ సిబ్బందితో చెక్ చేయండి. జంబో జెట్ బయలుదేరటానికి సిద్ధంగా వుంది."

ఇనస్పెక్టర్ జాన్సన్, సెక్యూరిటీ సర్వీస్ ఇనస్పెక్టర్ రాజపాల్ జంబో జెట్ చుట్టుముట్టి లోపలకు ప్రవేశిం చారు. లోపల వరుసగా కూర్చున్న ప్రయాణీకులు ఆశ్చ ర్యంగా చూడసాగారు వీళ్ళని.

ఇనస్పెక్టర్ జాన్సన్, సెక్యూరిటీ ఆఫీసరు సహాయంతో జంబో జెట్ తనిఖీ చేయసాగాడు. ఆత్రుతగా త్వరగా చూస్తున్నారు. ఏ పరిస్థితిలోను జంబో జెట్ ఆలస్యం కాకూడదు.

ఉన్నట్టుండి "హాండ్సప్" అంటూ రివాల్వర్ చూపాడు రఘువీర్.

ఇనస్పెక్టర్ జాన్సన్‌తో సహా అందరూ విస్తుపోయారు. ఇనస్పెక్టర్‌కి రివాల్వర్ తీసే వ్యవధి లేదు.

రఘువీర్ తప్పుకోమన్నాడు. చేసేదిలేక ఇన్‌స్పెక్టర్ తప్పుకున్నాడు.

రఘువీర్ రివాల్వర్‌తో బెదిరిస్తూనే బయటకు వచ్చి, రన్‌వేమీద పరుగు ప్రారంభించాడు.

ఒక్కొక్క లైటు దాటుకుంటూ పరుగు తీస్తున్నాడు. తెల్లని ఆ ఆకారం లైట్ల వెలుగులో కనిపిస్తుంది. ఇనస్పెక్టర్ జాన్సన్ వెంబడించాడు. ముందు రఘువీర్, వెనుక జాన్సన్, అప్పుడప్పుడు రఘువీర్ రివాల్వర్ పేలుస్తున్నాడు.

12

"టచ్ డౌన్ వన్ మైల్" అనటంతో పైలెట్ విజయ్ స్టీరింగ్ ముందు బలంగా తోశాడు.

నేలను గుద్దుకున్నట్లుగా రన్‌వే మీద దిగింది విమానం. దిగటంతోనే వెనకభాగం విరిగిపోయింది.

పైరుపగిలిన కారులా, రన్‌వేమీద అటు యిటు కదులుతూ దూసుకువస్తోంది. కుమార్, విజయ్ విమానాన్ని కంట్రోల్ చేస్తున్నారు. విమానం రన్‌వే మీద నిలవక జారిపోతుంది.

రఘువీర్ రొప్పుతూ రన్‌వేమీద పరుగుతీస్తూ పులిలా దూసుకువస్తున్న విమానం చూసి చటుక్కున ఆగాడు. కాని మరోవైపు ఇనస్పెక్టర్ జాన్సన్ బులెట్‌లా వేగంగా వస్తున్నాడు.

రఘువీర్ ఉపేక్షించకుండా చటుక్కున తప్పు కున్నాడు. కాని పడిశాలుకు ఎడమకాలు తగలటంతో తూలి క్రిందపడ్డాడు. గబాలున లేచాడుకాని, అంతలోనే విమానం మీదకు వచ్చింది. రఘువీర్ తూలి క్రిందపడ్డాడు. విమాన చక్రం రఘువీర్ మీదుగా వెళ్ళింది.

రఘువీర్ బిగ్గరగా అరుస్తూ, కప్పలా నేలకు అంటుకు పోయాడు.

—: ఐపోయింది :—